

కోడ్గల్‌లో ఓట్లు వేయడానికి క్యూలైన్‌లో నిలిచిన ఓటర్లు(ఫైల్)

- జడ్చర్లలో గులాబీ జెండా ఎగరడం ఖాయం
- ముచ్చటగా మూడోసారి ఎమ్మెల్యేగా లక్ష్మారెడ్డి గెలుపు పక్కా

## ఎన్నికల ఫలితాలపై

# ఉత్కంఠ

జడ్చర్ల, డిసెంబర్ 2 : జడ్చర్ల అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల పోలింగ్ ముగియడంతో జడ్చర్ల నియోజకవర్గంలో ఎన్నికల ఫలితాలపై ఆయా పార్టీల నాయకులు, ప్రజల్లో ఉత్కంఠ నెలకొన్నది. నవంబర్ 30వ తేదీన జడ్చర్ల అసెంబ్లీ ఎన్నికలు జరుగగా ఈనెల 3వ తేదీన ఎన్నికల ఓట్ల లెక్కింపు ఉండడంతో జడ్చర్ల మున్సిపాలిటీతోపాటు నియోజకవర్గంలోని మండలాలు, గ్రామాల్లో ఎన్నికల ఫలితాలపై ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు చర్చలు జరుపుతున్నారు. జడ్చర్ల నియోజకవర్గంలో మొత్తం 2,20,244 మంది ఓటర్లు ఉండగా అందులో 1,79,652 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఐదుగురు ఇతరులు ఉండగా అందులో నలుగురు ఓట్లు వేశారు. దీంతో నియోజకవర్గంలో 81.56శాతం పోలింగ్ నమోదైంది. ఏ పార్టీకి ఆపార్టీలు ఎవరికీ వారు పోటాపోటీగా ఎన్నికల ప్రచారాలు నిర్వహించడంతో ఓటర్లు ఈసారి ఎవరివైపు మొగ్గుచూపారనేది అంచనాలకు అందడంలేదు. జడ్చర్ల నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి లక్ష్మారెడ్డి ఎన్నికల ప్రచారంలో అందరికంటే ముందువరుసలో ఉన్నారు. జడ్చర్ల నియోజకవర్గంలో మూడోసారి గులాబీ జెండా ఎగరడం ఖాయంగా కనిపిస్తోందని పార్టీ వర్గాలు అంచనాలు వేస్తున్నాయి. జడ్చర్ల ఎమ్మెల్యేగా, మాజీ మంత్రి, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి జడ్చర్ల నియోజకవర్గంలో అభివృద్ధే లక్ష్యంగా పనిచేశారు. దీంతో నియోజకవర్గ ప్రజలు లక్ష్మారెడ్డికి పట్టం కట్టనున్నట్లు ఎన్నికల సరళిని చూస్తే తెలిసిపోతుంది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత సీఎం కేసీఆర్ బీదప్రజల కోసం రాష్ట్రంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు అందించడంతో అన్ని వర్గాల ప్రజలు, వృద్ధులు, మహిళలు, దివ్యాంగులు, రైతులు, చేతివృత్తులవారు బీఆర్‌ఎస్ వైపే మొగ్గు చూపారనేది ఈ ఎన్నికలలో తెలిసిపోయింది. ప్రతి ఇంటికి ఏదో ఒక పథకం ద్వారా లబ్ధిచేకూరడంతో అందరు బీఆర్‌ఎస్‌కే మద్దతు తెలిపారని, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి నియోజకవర్గంలో చేసిన అభివృద్ధితో ప్రజల్లో మంచి స్పందన వచ్చింది. దీంతో వరుసగా ముచ్చటగా మూడోసారి గెలుపొందుతారని జడ్చర్ల బీఆర్‌ఎస్ శ్రేణుల్లో అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అభివృద్ధే లక్ష్యంగా పనిచేసిన నాయకుడికి ప్రజలు అండగా నిలుస్తారనేది ఈ ఎన్నికల్లో తేలిపోయింది. ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి భారీ మెజార్టీతో గెలుపొందుతారని, బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో జడ్చర్ల నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడవడం జరిగింది. దీంతో ప్రజలు బీఆర్‌ఎస్ వైపే మొగ్గు చూపారని నాయకులు, కార్యకర్తలు చర్చించుకుటుంన్నారు. జడ్చర్లలో మొత్తం 15 మంది అభ్యర్థులు పోటీ చేసినా ముఖ్యంగా బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల అభ్యర్థుల మధ్యనే పోటీ నెలకొన్నది. ఈ రెండు పార్టీల అభ్యర్థులు వారి అనుచరులు ఎవరికీ వారే అంచనాలు వేసుకుంటూ గెలుపుపై ధీమాగా ఉన్నారు. ఆదివారం ఓట్ల లెక్కింపుతో వారి భవిష్యత్తు తేలిపోనుంది. ఆదివారం ఎన్నికల ఫలితాలు వెలువడే వరకు అందరిలోనూ ఉత్కంఠ కొనసాగనుంది. అప్పటి వరకు అగాల్సిందే.

### 14 టేబుళ్లు, 20 రౌండ్లు

జడ్చర్ల అసెంబ్లీకి జరిగిన ఎన్నికల ఫలితాల కోసం మొత్తం 14టేబుళ్లు, 20 రౌండ్లలో ఓట్ల లెక్కింపు ఉండనుంది. నియోజకవర్గంలో మొత్తం 274 పోలింగ్ కేంద్రాలు ఉండడంతో ఒక్కో సారి 14 బూత్‌లకు సంబంధించిన ఈవీఎంలను తీసుకొని ఓట్లను లెక్కించడం జరుగుతుంది. దానికిగానూ 20 రౌండ్లలో ఓట్లను లెక్కించడం జరుగుతుంది.

## బట్టబ్యాగులు పంపిణీ



బట్టబ్యాగులను పంపిణీ చేస్తున్న సొసైటీ నిర్వాహకులు

జడ్చర్లటౌన్, డిసెంబర్ 2 : జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవం సందర్భంగా ఉమెన్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ పరిధిలోని విద్యానగర్‌కాలనీలో మహిళలకు బట్ట బ్యాగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ కోసం తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ కాలుష్యాన్ని నియంత్రించాలని కోరారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ సంచులను వదిలిపెట్టి బట్ట బ్యాగులను వినియోగించాలని కోరారు. కార్యక్రమంలో ఉమెన్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షురాలు బాలమణి, శిరీష, సంస్కారభారతి సభ్యుడు గోనెల రాధాకృష్ణ, గోపాల్‌గౌడ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

## లక్ష్మారెడ్డి గెలవాలని పూజలు



యాదగిరిగుట్టలో పూజలు నిర్వహించిన సర్పంచ్ కుటుంబ సభ్యులు

మిడ్జిల్, డిసెంబర్ 2 : అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం మళ్లీ రావాలని, జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి భారీ మెజార్టీతో మళ్లీ గెలవాలని లక్ష్మీనర్సింహాస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. శనివారం మిడ్జిల్ మండలంలోని వాడ్యాల్ సర్పంచ్ మంగమ్మ, శ్రీనివాసులు కుటుంబ సభ్యులు యాదగిరి గుట్ట లక్ష్మీనర్సింహాస్వామి అలయంలో ప్రత్యేక అర్చన, పూజలు చేసి భారీ మెజార్టీతో బీఆర్‌ఎస్ అభ్యర్థి లక్ష్మారెడ్డి గెలవాలని దేవుడిని ప్రార్థంచారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు శంకర్, లత ఉన్నారు.

## ఉరేసుకొని మహిళ ఆత్మహత్య

మిడ్జిల్, డిసెంబర్ 2 : అనారోగ్య సమస్యలతో ఓ మహిళ బాధపడుతూ ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని చిల్వేర్‌లో శనివారం చోటు చేసుకున్నది. మృతురాలి కుటుంబ సభ్యులు, గ్రామస్తుల కథనం మేరకు గ్రామానికి చెందిన నందిని కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతుంది. ఎన్ని దవాఖానలకు చూపించిన రోగం తగ్గడం లేదని తెలిపారు. శుక్రవారం రాత్రి తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో నందిని ఉరేసుకొని అత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు కాపాడే ప్రయత్నం చేసిన అప్పటికే మృతి చెందింది. నందిని తల్లిదండ్రులు తమ కూతురి మృతిపై అనుమానాలు ఉన్నాయని పోలీసులుకు ఫిర్యాదు చేశారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు నందిని ఆత్మహత్యకు గల కారణాలపై ఆరాతీసి, పంచనామా నిర్వహించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ఆమె మృతదేహాన్ని జడ్చర్ల ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఘటనపై కేసు నమెదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్సై శివనాగేశ్వర్‌నాయుడు తెలిపారు.

## ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌ను అమలు చేయాలి

- టీవీవీయూ రాష్ట్ర మహిళా కార్యదర్శి వెంకటేశ్వరమ్మ




సిద్దోటంలో కరపత్రాలను విడుదల చేస్తున్న యూనియన్ నాయకులు

నవాబ్‌పేట, డిసెంబర్ 2 : దేశ వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్‌కు కేంద్రప్రభుత్వం చట్టబద్ధత కల్పించాలని తెలంగాణ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ రాష్ట్ర మహిళా కార్యదర్శి వెంకటేశ్వరమ్మ కోరారు. మండలంలోని సిద్దోటం గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఛలో ఢిల్లీ కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దళితులపై దాడులు, దౌర్జన్యాలు పెరిగి పోయాయన్నారు. కార్పొరేట్ బహుళజాతి సంస్థలకు తలొగ్గి ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించడం, ప్రభుత్వ రంగ పెట్టుబడులను ఉపసంహరించుకోవడం చేస్తుందని విమర్శించారు. దళిత రాజ్యాంగ హక్కుల పరిరక్షణ, దేశవ్యాప్త ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం అమలుకు ఈనెల 4న నిర్వహించతలపెట్టిన ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు వెంకటయ్య, శ్రీనివాసులు, జంగయ్య, బాలయ్య, రమేశ్, చంద్రయ్య, జయమ్మ, యాదమ్మ పాల్గొన్నారు.

## రాష్ట్రంలో మళ్లీ బీఆర్‌ఎస్ సర్కారే వస్తుంది

- జెడ్పీటీసీలు అన్నపూర్ణ, రాజేశ్వరి

దేవరకద్ర రూరల్(కౌకుంట్ల), డిసెంబర్ 2 : రాష్ట్రంలో గత నెల 30న జరిగిన ఎన్నికలకు సంబంధించిన ఫలితాల్లో బీఆర్‌ఎస్ మళ్లీ గెలుస్తుందని దేవరకద్ర జెడ్పీటీసీ అన్నపూర్ణ, చిన్న చింతకుంట జెడ్పీటీసీ రాజేశ్వరి పేర్కొన్నారు. శనివారం ఆయా మండల కేంద్రాల్లో వారు విలేకరులతో మాట్లాడారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలే బీఆర్‌ఎస్‌ని గెలిపిస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీజేపీపై ప్రజలకు నమ్మకంలేదని పేర్కొన్నారు.

24 గంటల కరెంటు, రైతుబంధు, రైతుబీమా పథకాల ద్వారా లబ్ధిపొందిన రైతాంగం అంతా సీఎం కేసీఆర్ నాయకత్వాన్ని కోరుతున్నారని తెలిపారు. ఇతర పార్టీలది కేవలం ఫేక్ వీడియోలు చూపించి పార్టీ కార్యకర్తలను నిరుత్సాహ పరిచేందుకు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. దేవరకద్ర నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటూ పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేశారని తెలిపారు. దేవరకద్రలో కచ్చితంగా ఆల వెంకటేశ్వర్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలువబోతున్నారని ధీమా వ్యక్తం చేశారు.



జడ్చర్లలో ఫుట్‌బాల్ పోటీలో పాల్గొన్న క్రీడకారులు

## హోరాహోరీగా ఫుట్‌బాల్ పోటీలు

- రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన ఉమ్మడి జిల్లా జట్టు
- విజేతలకు బహుమతులు ప్రదానం

జడ్చర్లటౌన్, డిసెంబర్ 2 : స్కూల్ గేమ్స్ ఫేడరేషన్ ఆధ్వర్యంలో అండర్-17 ఉమ్మడి జిల్లా బాలుర ఫుట్‌బాల్ జట్ల ఎంపికలను శనివారం బాదేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని మహబూబ్‌నగర్, గద్వాల్, నాగర్‌కర్నూల్, నారాయణపేట, వనపర్తి జిల్లాలకు చెందిన జట్లు తలపడ్డాయి. వంద మంది క్రీడాకారులు ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొన్నారు. హోరాహోరీగా కొనసాగిన ఫుట్‌బాల్ పోటీల్లో మహబూబ్‌నగర్ జట్టు విజేతగా నిలిచింది. గద్వాల జట్టు రన్నర్స్ స్థానంలో నిలిచింది. ఈ క్రమంలో ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను గుర్తించి ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకు జడ్చర్లలో జరుగనున్న రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఆడనున్నారు. ఈ సందర్భంగా జడ్చర్ల ఎంఈవో మంజులాదేవి విజేత, రన్నర్స్ జట్లకు బహుమతులను ప్రదానం చేశారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి విజయం సాధించి ఉమ్మడి మహబూబ్‌నగర్ జట్టుకు పేరు తేవాలని ఎంఈవో సూచించారు.

కార్యక్రమంలో జెడ్పీ హైస్కూల్ జీహెచ్‌ఎం చంద్రకళ, స్కూల్‌గేమ్స్ ఫేడరేషన్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి రమేశ్ బాబు, తెలంగాణ పీఈటీల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు, ప్రధానకార్యదర్శి విలియం, కృష్ణ, ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి భానుకిరణ్, పీఈటీలు మేర్సీ, వడెన్న, రామన్‌గౌడ్, రామకృష్ణ, రాములు, మొయిన్, శంకర్‌నాయక్, బాలరాజు, రామ్మోహన్‌గౌడ్, తిరుపతి, రాజేందర్, నికేశ్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.